అటవీ ఉత్పత్తులకు ఆదరణ కరువు

- వ్యాపార మార్గాల వైపు జీసీసీ చూపు
- సీజన్‌కు సేకరణ లక్ష్యం నిర్దేశించిన ఐటీడీఏ
- సమాలోచనలు చేస్తున్న అధికారులు



అటవీ ఉత్పత్తుల ద్వారా తయారు చేసిన చీపుర్లు

ఇల్లెందు: ఏటా అటవీ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరుగుతున్నా అటవీ సంపద మాత్రం ఆశించినంత లభించటం లేదు. ఇందుకు కారణం అడవులు తరిగిపోతున్నాయి. కేవలం నిత్యావసర సరుకులు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు సరుకులు సరఫరా చేయటానికే పరిమితం అయిన జీసీసీ అటవీ ఉత్పత్తుల సేకరణపై దృష్టి సారించటంలో వెనకబడింది. ఈనెల 23న ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు భద్రాచలం డీఎం పరిధిలోని బ్రాంచి మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సీజన్‌లో అటవీ ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనాదిగా ఆదివాసులకు అటవీ సంపద వరం. అటవీ ఉత్పత్తుల సేకరణలో ఆటుపోట్లను ఎదుర్కోవడమూ తప్పదు. ఏటా పోడు వ్యవసాయం పెరిగి అడవులు తరిగిపోతున్నాయి. దీంతో అటవీ సంపద తరిగిపోతోంది. ఆదివాసీలు సేకరించే అటవీ ఉత్పత్తులకు సరైన ధర అందించి దళారీల బెడద తప్పించాలని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలు చేయాల్సి ఉంది. అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన గిరిజనులకు ఆదాయం చేకూర్చడం కోసం జీసీసీ డీఆర్ డిపోలలో కొనుగోలు చేపట్టింది. అయితే గతంలో రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తులు అటవీశాఖ అనుమతి లేదనే కారణంతో గోదాముల్లోనే నిల్వ ఉంచడంతో నష్టాలొచ్చాయి.

అటవీ ఉత్పత్తుల సేకరణ కంటే ఇతర వ్యాపార మార్గాల వైపు ఆసక్తి కనపబరుస్తోంది. భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు డివిజన్ పరిధిలోని 5 బ్రాంచీల్లో సమావేశాలు నిర్వహించి లక్ష్యం నిర్దేశించారు. త్వరలో ఇప్ప పువ్వు సీజన్ రానుండటంతో పెద్ద ఎత్తున ఇప్ప పువ్వును సేకరించాలని నిర్ణయించారు. భద్రాచలం, ఇల్లెందు, మణుగూరులో అత్యధికంగా వెయ్యి క్వింటాళ్లు, దమ్మపేట, పాల్వంచలో తక్కువ లభించే అవకాశం ఉందని నిర్ధారణకు వచ్చారు.

దళారుల బెడద...

అటవీ హక్కుల చట్టం రావడంతో పోడు భూములకు పట్టాలు లభించాయి. దీంతో అడవికి నరికివేతకు గురయింది. ఇటీవల గుండాల మండలంలో ఓ దళారీ ముష్టిగింజలను కొనుగోలు చేస్తూ గిరిజనులను నిండా ముంచుతుండటంతో అక్కడి జీసీసీ ఉద్యోగి సహకారంతో పట్టుకుని కేసు నమోదు చేశారు. అటవీ ఉత్పత్తులను కారు చౌకగా దళారులు కొనుగోలు చేసి లాభాలు గడిస్తున్నారు. దళారీల తప్పించడంలో జీసీసీ విఫలం అవుతోంది.

కానరానీ అటవీ ఉత్పత్తులు..

ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం లాంటి బ్రాంచిల పరిధిలో అటవీ ఉత్పత్తుల సేకరణ అధికంగా ఉండేది. కాలక్రమేణా అటవీ ఉత్పత్తుల సేకరణ బాగా తగ్గిపోయింది. కొన్ని రకాల అటవీ ఉత్పత్తులు మచ్చుకు కూడా కనిపించటం లేదు. ముఖ్యంగా చీపుర్లు, ఇస్తరాకులు, మారేడు గడ్డలు, కరక్కాయలు, తేనే, ఎండు ఉసిరి పప్పు, కుంకుడు కాయలు, తబిసి బంక, గచ్చకాయలు, నరమామిడి చెక్క ఇలా అనేక ఉత్పత్తులు కనుమరుగయ్యాయి.



తాము తయారు చేసిన ఇస్తరాకులను అమ్ముకునేందుకు వెళ్తున్న గిరిజనులు



ఇల్లెందు జీసీసీ కార్యాలయం

ప్రణాళిక లేదు..



పోడు సాగు పెరగడం, అటవీ ఉత్పత్తుల సేకరణకు సమయం లేకపోవడంతో గిరిజనులు వాటిపై ఆసక్తి చూపడం లేదు. అడవులు అంతరించిపోవటం కూడా ఒక కారణం. సేకరించినా వాటిని సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల కూడా శ్రమ వృథా అవుతోంది. జీసీసీ కార్యాచరణ సక్రమంగా లేకపోవటం కూడా మరో కారణం.

– ముక్తి కృష్ణ, మామిడిగుండాల

జీసీసీని రక్షించాలి..



గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వారికి నిత్యావసరాలు అందజేయడం జీసీసీ లక్ష్యంగా ఉంది. రానురాను జీసీసీ అటు కొనుగోలులో వెనకబడింది. దీనివల్ల గిరిజనులను దళారులు దగా చేస్తున్నారు. ప్రభుత్వం జీసీసీని రక్షించాలి. కూలి చేసుకుని జీవనం సాగించే వారికి జీసీసీ దిక్కవుతోంది. అలాంటి జీసీసీని రక్షించాలి. – యదళ్లపల్లి సత్యం, ఎన్డీ నేత

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవికి అందజేశారు. జటంగి వెంకన్న, సారంగపాణి, యాకూబ్‌షావలి, సామేలు, రామిశెట్టి నర్సింహారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టేకులపల్లి: బేతంపూడి పంచాయతీ అబ్బిరెడ్డిగూడెంలో జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ యదళ్లపల్లి బాబు, ఉప సర్పంచ్ డేగటి సత్యనారాయణ, ఈది గణేష్, అజ్మీర వీరన్నపాల్గొన్నారు.

ప్రజాసేవ చేస్తాం..

కొత్తగూడెంరూరల్: ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించినా డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తామని ట్రస్ట్ కోఆర్డినేటర్ మోదుగు జోగారావు అన్నారు. స్థానిక పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం గెట్ టూ గెదర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు కొంతమంది అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అయినా తాము మాత్రం విద్య, వైద్యం, ఉపాధి వంటి సామాజిక కార్యక్రమాలను నియోజకవర్గంలోని ప్రజలకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వీఓఏల అరెస్ట్

టేకులపల్లి: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 42 రోజులుగా వీఓఏలు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దశలవారీ ఆందోళనల్లో భాగంగా సోమవారం వీఓఏలు రాష్ట్ర రాజధానిలో ధర్నా కార్యక్రమం నిర్వహించ తలపెట్టారు. విషయం తెలుసుకున్న టేకులపల్లి పోలీసులు వీఓఏలను హైదరాబాద్ వెళ్లనీయకుండా అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు చేశారు. మూడు చరణ్, శిరీషా, రజితలను టేకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం తరువాత విడిచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియా సమీపంలోని సమ్మక్క గద్దెల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. కొమరారం గ్రామానికి చెందిన ప్రసాద్ బైక్‌పై ఇల్లెందుకు వెళ్తుండగా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామానికి చెందిన రమేష్ బైక్‌పై కొమరారం వస్తున్నాడు. ఇద్దరూ ఢీకొట్టుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభినవ్‌నాయక్‌కు సిల్వర్ మెడల్



అభినవ్‌ను అభినందిస్తున్న కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన అభినవ్‌నాయక్ సిల్వర్ మెడల్ సాధించినట్టు అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో లాంగ్‌జంప్ విభాగంలో అభినవ్ నాయక్ 6.24 మీటర్లు జంప్ చేసి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

గోవుల తరలింపు అడ్డగింత

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గోవులను పోలీసులు సోమవారం గోశాలకు అప్పగించారు. వివరాలు.. చర్ల నుంచి జనగామకు మూడు బొలేరో ఆటోల్లో అక్రమంగా గోవులను తరలిస్తుండగా మార్గమధ్యలో దుమ్ముగూడెం పోలీసులు పట్టుకున్నారు. మంచికంటి నగర్‌లోని అన్నపూర్ణ గోశాలకు అప్పగించారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి

జూలూరుపాడు: జూన్ 4న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన సభ విజయవంతం కోసం సోమవారం ఆ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి, ఇంటింటి వెళ్లి ప్రజాగర్జన సభ కరపత్రాలను పంపిణీ చేశారు. కాకర్ల గ్రామంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొత్తగూడెంలో లక్షమందితో నిర్వహించ తలపెట్టిన ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. చాంద్‌పాషా, సీతయ్య, నాగయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

టేకులపల్లి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్స్, వాటర్‌మెన్స్, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ మాళోతు సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీలకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస్ బేసిక్‌ను వేతనంగా చెల్లించాలని, ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, జీఓ 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జేఏసీ మండల చైర్మన్ మూడు బిచ్చునాయక్, కన్వీనర్ సిరికొండ నాగేశ్వరరావు, ఇఫ్టూ నేత జర్పుల సుందర్, నాయకులు, కార్మికులు అన్నాజీ, వెంకటాచారి, మహేష్, అచ్చయ్య, పవన్, లక్ష్మయ్య, సురేష్, లాలు, మోహన్, సుందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ఇల్లెందురూరల్: పోడు సాగుదారులందరికీ అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ నార్త్ ఈస్ట్ తెలంగాణ రీజినల్ కమిటీ సభ్యుడు యాకన్న, ఇఫ్టూ జిల్లా నాయకుడు డి.ప్రసాద్, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి బొగ్గారపు సంగయ్య డిమాండ్ చేశారు. లచ్చగూడెం గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామంలో శంకర్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏ లక్ష్యంతో ఉద్యమించామో మరచి సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోడుభూములను లాగేసుకునే ప్రయత్నాలు ప్రజా ఉద్యమాల ద్వారా అడ్డుకున్నామని, నేటికీ అదే పరిస్థితి ఉందన్నారు. పోడు భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతిరైతుకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బొగ్గారపు వెంకన్న, రమణయ్య, మాధవరావు, చంద్ర, గన్యా, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.


దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ నిర్మలజ్యోతి

జూలూరుపాడు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి అన్నారు. కాకర్ల, గుండెపుడి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం కొమ్ముగూడెం, జూలూరుపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జరగనున్నట్లు చెప్పారు. జూన్ 1న అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభం చేయాలన్నారు. ఔషధ మొక్కలపై మహిళలకు అవగాహన కల్పించి ఇళ్లలో పెంచుకునే విధంగా చైతన్య పరచాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సేవ్ వాటర్, ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను అంగన్‌వాడీ టీచర్లకు వివరించారు. అదేవిధంగా మేరీ లైఫ్ యాప్‌లో జీపీఎస్ మ్యాప్ ద్వారా ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జూన్ 3న ఎమ్మార్పీఎస్ సదస్సు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: జూన్ 3న తల్లాడలో జరిగే ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ ఉమ్మడి ఖమ్మం జిల్లా సంయుక్త సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. గో టూ విలేజ్ పేరుతో 50 రోజులుగా గ్రామస్థాయిలో నూతన కమిటీలు జరుగుతున్నాయని, ఈ కమిటీలను పూర్తి చేసుకొని సదస్సుకు హాజరు కావాలన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో జరిగే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేస్తారా? లేదా మాదిగల చేతిలో ఓటమికి గురవుతారో ఈ సభ ద్వారా తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చెంగల గురునాథం, గార్లపాటి రాంబాబు, మందా బాబు, గార్లపాటి కృష్ణయ్య, కొమ్ముగిరి కామేశ్వరరావు, అశోక్, నరేందర్, పోతురాజు నరసింహారావు, చార్లెస్, రంజిత్, చెంగల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఇంటి ఎదుట ఆందోళన



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

జూలూరుపాడు: మా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మాకు అప్పగించాలంటూ భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనకతండాలో సోమవారం ఎంపీపీ లావుడ్యా సోనీ ఇంటి ఎదుట డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. రెండు వారాలుగా రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు కేటాయించిన ఇళ్లను అప్పగించాలని, ఎంపీపీ మాకు న్యాయం జరిగేలా చూడాలని అప్పటి వరకు ఇక్కడ నుంచి కదలమని భీష్మించుకుని కూర్చున్నారు. లబ్ధిదారులు ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తుండటంతో ఎంపీపీ తనయుడు, భోజ్యా తండా సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'డబుల్' ఇళ్లను సందర్శించిన సీఐ

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని సోమవారం రాత్రి జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్, ఎస్సై పోటు గణేష్ ఆకస్మికంగా సందర్శించారు. కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఇళ్లకు కరంటు సౌకర్యం లేదని, వీధిలైట్లు, తాగునీటి సరఫరా లేదని, అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయని, వీధుల్లో పిచ్చిగడ్డి మొక్కలు పెరిగాయని, వాన కురిస్తే ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టే పరిస్థితి లేదని సీఐ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని సీఐ చెప్పారు. ప్రశాంత జీవనం సాగించాలని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో పాపకొల్లు సర్పంచ్ బాదావత్ లక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో అందజేయాలి

ఇల్లెందురూరల్: రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. ఇల్లెందులోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో, గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉమర్, కందగట్ల సురేందర్, కుంజ కృష్ణ, జక్కుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామ రక్ష



సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఇల్లెందు: మూడోసారి కూడా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టబోతున్నాడని, ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీరామ రక్షగా ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం రాత్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. గతంలో తాను ఇచ్చిన మాట ప్రకారం ఇల్లెందు అభివృద్ధిని చేసి చూపించానన్నారు. జూన్ 2 నుంచి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఉందని, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించాలని కోరారు. ఇల్లెందు నియోజకవర్గానికి రూ.786 కోట్లు అభివృద్ధి పనులకు అందజేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సౌఖ్యంగా ఉన్నారని మూడు నెలల కాలమే ఉంది చేసిన పనిని ప్రజలకు వివరించాలన్నారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యను మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యేగా సీటు ఇస్తే ఓడిపోయిన నీకు మూడు నెలలు తిరగక ముందే జెడ్పీటీసీగా గెలిపించి జెడ్పీ చైర్మన్‌ను చేసి ఫార్చునర్ కారు ఇస్తే తిరిగినన్నీ రోజులు తిరిగి బీఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు ద్రోహం చేసిన జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తక్షణం రాజీనామా చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఇల్లెందులో లైట్లు, చెట్లు, రోడ్లు, మంచినీటి సరఫరా, భవన నిర్మాణాలు, బస్ డిపో ఇలా ఎన్నో సాధించామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్‌నాయక్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల నాయకులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే భౌతికదాడులు



మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న ఆదరాభిమానాలను చూసి ఓర్వలేక, రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో పొంగులేటి కార్యాలయాలపై భౌతికదాడులు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో భావ ప్రకటన, స్వేచ్ఛ ప్రతీఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, అవినీతిపై విమర్శలు చేస్తున్న నాయకులపై విమర్శలకు ప్రతి విమర్శలుచేయాలే తప్ప కార్యాలయాలపై అనుచరులపై బహిరంగంగా దాడులకు దిగడం సరికాదన్నారు. ఇలాంటి పద్ధతి మార్చుకొని విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవుపలికారు. కార్తీక్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సూర్నపాక సత్యనారాయణ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, ముక్తి కృష్ణ, తాటి భిక్షం, నాగార్జున్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలపై నాయకులను నిలదీయాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రజలందరూ చైతన్యవంతులై ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు అంశాన్ని నిలదీయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అవతరణ దినోత్సవం పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేస్తూ ఏదో పెద్ద ఘనత సాధించినట్లు హంగామా చేస్తోందని ఆరోపించారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకే తాను కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. పేదలకు డబల్ బెడ్ రూం ఇళ్లు కచ్చితంగా ఇచ్చి తీరుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేలా చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే వనమా ముఖం చాటేశారన్నారు. కార్యక్రమంలో చెనిగారపు నిరంజన్ కుమార్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్, సిద్దంకి మల్లేష్, సందేల సందీప్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: అయ్యప్ప స్వామి కృపతో కోయగూడెంతో పాటు ఇల్లెందు నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు సోమవారం కోయగూడెం అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో కోయగూడెంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ శిలాస్థాపన, భూమిపూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కేరళ తంత్రి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణంలో తన వందు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా జెడ్పీ చైర్మన్ స్వగ్రామమైన కోయగూడెంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు హాజరు కాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో లక్కినేని సురేందర్‌రావు, చీమల సత్యనారాయణ, ఊకె రామకృష్ణ, చీమల రామకృష్ణ, బోడ బాలు, దళపతి శ్రీనివాస్‌రాజు, బానోతు రామ, ధరావత్ బాలాజీ, జర్పుల లచ్చు, బర్మావత్ శివకృష్ణ, జాటోతు నరేష్, ఉండేటి బసవయ్య, గంగారపు రమేష్, కిన్నెర శ్రీను, కొండబత్తుల శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

ఇల్లెందు: చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. ఇల్లెందులోని రాందేవ్‌బాబా మందిరంలో మాతృశ్రీ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి, ఇంటర్, ఒకేషనల్ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే సన్మానించారు. ప్రతి విద్యార్థికి జ్ఞాపిక, రూ.వెయ్యి బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ ప్రతి ఏటా వివిధ రంగాలలో ప్రతిభకనబర్చిన యువత, విద్యార్థులను గుర్తించి వారిని మరింతగా ప్రోత్సహించడం తోపాటు ఇతరులకు స్ఫూర్తినింపేలా సన్మానించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాతృశ్రీ సేవా సంస్థ అధ్యక్షుడు గౌరిశెట్టి పురుషోత్తమ్, కార్యదర్శి తాటిపల్లి సుబ్బారావు, రమేష్, వ్యామసాని జనార్ధన్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడో..?





బోడు గ్రామంలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం, లచ్చగూడెంలో..

టేకులపల్లి మండలం బోడు, లచ్చగూడెం గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. శంకుస్థాపన చేసి నిర్మాణాలు కూడా ప్రారంభిచారు. ఇప్పటికే భవనాలు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఏం జరిగిందో తెలీదు.. ఏడాది క్రితమే పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా నిర్మాణ పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ, పీఆర్, టేకులపల్లి
సెల్ నెంబర్: 96760 29621